బిల్లు ఆమోదింపజేస్తారా...రాజీనామా చేస్తారా

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై బిజెపి ఎంపిలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి హెచ్చరిక
- మోడీ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచాలి : తమ్మినేని
- ఇందిరాపార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా


అభివాదం తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆమోదించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదింపజేయాలని కోరారు. లేదంటే రాష్ట్రంలో గెలిచిన బిజెపి ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. బిసి రిజర్వేషన్లను అమలు చేసేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కానీ బిసి రిజర్వేషన్ల అమలుకు, సామాజిక న్యాయానికి, కులగణనకు బిజెపి వ్యతిరేకమని విమర్శించారు. రాజ్యాంగానికి కూడా వ్యతిరేకమని చెప్పారు. మనువాద రాజకీయాలను చేస్తున్నదని అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లలో ముస్లిములు ఉన్నారంటూ అందుకే ఆమోదించడం లేదంటూ బిజెపి నాయకులు చెప్తున్నారని వివరించారు. అందులో బిసి రిజర్వేషన్లలో హిందువులు కూడా ఉన్నారనీ, వారికి వ్యతిరేకమా? అని ప్రశ్నించారు. బిజెపి ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నదని విమర్శించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో బిజెపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. తెలంగాణలో ఎందుకు వ్యతిరేకిస్తున్నదని ప్రశ్నించారు. బిసిల ఓట్లు కావాలి కానీ వారికి రిజర్వేషన్లను కల్పించొద్దా?అని అడిగారు. బిసి రిజర్వేషన్ల అమలుకు అడ్డంకిగా ఉన్న బిజెపి తీరును గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని సూచించారు. ఆ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలంటూ కేంద్రంపై, ప్రధాని మోడీపై ఒత్తిడి తేవాలని, లేదంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని డిమాండ్ చేశారు. బిజెపిలో చేరిన ఆర్ కృష్ణయ్య, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగ స్పందించాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఢిల్లీకి కాంగ్రెస్ నాయకులే కాకుండా అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. బిజెపికి వ్యతిరేకంగా బిసి రిజర్వేషన్లకు అనుకూలంగా ఉండే పార్టీలను భాగస్వాములను చేయాలని చెప్పారు. కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేయొద్దని సూచించారు. బిసి రిజర్వేషన్ల అమలుకు ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలనీ, సిపిఎం మద్దతిస్తుందని అన్నారు.

బిసి రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నాం : తమ్మినేని

బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుతోపాటు ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం చెప్పారు. బిజెపికి వక్రబుద్ధి ఉందన్నారు. అందుకే బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడం లేదని అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. బిసి బిల్లును ఆమోదిస్తే కాంగ్రెస్‌కు లాభం జరుగుతుందన్న అభిప్రాయంలో బిజెపి ఉందన్నారు. అందుకే ఆమోదించడం లేదని చెప్పారు. ఆ బిల్లును వ్యతిరేకిస్తే బీహార్‌లో ఎన్నికల దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. ఢిల్లీకి అన్ని శక్తులనూ తీసుకెళ్లి కేంద్రంపై రాజకీయ ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

గవర్నర్‌ది నాన్చివేత ధోరణి : ఎస్ వీరయ్య

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై న్యాయపరిశీలన పేరుతో కావాలనే నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శించారు. బిసి రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే గవర్నరే నిర్ణయం తీసుకోవాలని కేంద్రం వెనక్కి ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెడితే ఏ పార్టీ రంగు ఏంటో బయటపడుతుందన్నారు. రాజ్యాంగంలో కులాల ప్రస్తావనే లేదని, వెనుకబడిన సామాజిక తరగతుల వారికి రిజర్వేషన్లు ఇవ్వాలనే ప్రస్తావన ఉందని చెప్పారు.

బిజెపి ఎంపిలు ఏం చేస్తున్నారు : టి జ్యోతి

తెలంగాణకు చెందిన ఎనిమిది మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు బిసి రిజర్వేషన్ల బిల్లుపై ఎందుకు మాట్లాడటం లేదని అధ్యక్షత వహించిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికలను ఆలస్యం చేస్తున్నదని విమర్శించారు. దీంతో రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆగాయని చెప్పారు.

ప్రజల బాధలు పెంచేలా మోడీ సర్కారు నిర్ణయాలు : జూలకంటి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల కష్టాలు, బాధల్ని తీర్చే చట్టాలు చేయకుండా వారు మరింత ఇబ్బందులు పడేలా, కష్టాలపాలయ్యేలా చేస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు హోల్‌సేల్‌గా అమ్మేందుకు యత్నిస్తున్నదని, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను చేస్తున్నదని ఎండగట్టారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై పోరాడేందుకు సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని పార్టీలనూ కలుపుకుని ముందుకు పోవాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లను మొదటి నుంచీ బిజెపి వ్యతిరేకిస్తున్నదనీ, అది ఆ పార్టీ నిర్ణయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, ఆర్ శ్రీరాంనాయక్, ఆర్ అరుణజ్యోతి, పి ఆశయ్య, ఉడుత రవీందర్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సేవలు మరవలేనివి : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని (ఆగస్టు 6) పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని, ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని పేర్కొన్నారు. పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారనీ, పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని చెప్పారు. ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవలకు గుర్తింపుగా జూన్ 14న గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను సినీ కళాకారులకు, సినీ ప్రముఖులకు అందించనున్నట్టు తెలిపారు.. ఆయన జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కార్మికుల భద్రతను గాలికొదిలేస్తున్న ప్రభుత్వం

- పాలడుగు భాస్కర్
- సెప్టెంబర్‌లో యూనియన్ రాష్ట్ర మహాసభ
- ఆహ్వాన సంఘం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల భద్రతను గాలికొదిలేస్తోందని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్ విమర్శించారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం మంగళవారం రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని అరుణ ఫంక్షన్ హాల్‌లో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిషన్, టి నర్సింహా అధ్యక్షతన జరిగింది. సెప్టెంబర్ 19-20 తేదీల్లో తుర్కయంజాల్‌లో రాష్ట్ర మహాసభ జరగనుంది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వారికి పని భద్రత, పర్మినెంట్‌కు నోచుకోవడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, కనీస వేతనాల అమలుతోపాటు 2వ పీఆర్సీలో మినిమం బేసిక్ రూ.26 వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మహాసభ జయప్రదానికి విరాళాలు ఇవ్వాలని, మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి కవిత, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్వప్న, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బలరామ్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి యాదగిరి, నాయకులు సిహెచ్ ఎల్లేష్, జె పెంటయ్య, బాబు పాల్గొన్నారు.

ఆహ్వాన కమిటీ..

ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా తిప్పర్తి యాదయ్య (డిప్యూటీ కమిషనర్, జిహెచ్ఎంసి తెలంగాణ ఉద్యోగుల సంఘం), జనరల్ సెక్రటరీ డి కిషన్ (యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు), ట్రెజరర్ సిహెచ్ ఎల్లయ్య, చీఫ్ ప్యాట్రన్స్ పాలడుగు భాస్కర్ (యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు), ప్యాట్రన్స్‌గా ఎం చంద్రమోహన్ (రంగారెడ్డి జిల్లా కార్యదర్శి) తదితరులతో ఆహ్వాన సంఘం ఏర్పడింది.

రాజకీయాల్లో దిగజారుతున్న విలువలు

- అదే దారిలో జర్నలిజం
- సోషల్ మీడియా బూతు మీడియాగా మారింది
- విలీనం-విభజన పుస్తకావిష్కరణ సభలో వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో విలువలు నానాటికి దిగజారి పోయాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ పాత్రికేయులు ఇనగంటి వెంకట్రావు రాసిన 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలు కులం, మతం, డబ్బుల చుట్టు తిరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో వచ్చిన ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా మారిందని వ్యాఖ్యానించారు. ఇలాంటి వారిని ఓటు అనే ఆయుధంతో తిరస్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దీన్ని అడుగడుగునా అడ్డుకోవాల్సిన మీడియా సైతం వారి అడుగు జాడల్లోనే నడుస్తోందని అన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా బూతు మీడియాగా మారిందని వ్యాఖ్యానించారు. పత్రికలు సమాజానికి దర్పణం లాంటివనీ, సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదనీ, దానికోసం ఉన్న కాలమ్స్‌లో తమ తమ అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన తల్లి గుర్తుకు వచ్చినప్పుడు... రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడని భావోద్వేగానికి గురయ్యారు. తనకు రాజకీయాల నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. విలీనం-విభజన పుస్తకాన్ని నేటితరం యువత తప్పని సరిగా చదవాలని సూచించారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

- కేంద్ర నిధుల కోతలతో గ్రామీణాభివృద్ధికి ఆటంకం
- కేంద్ర మంత్రి పి చంద్రశేఖర్‌కి మంత్రి డాక్టర్ సీతక్క విజ్ఞప్తి


కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) డిమాండ్ చేశారు. కేంద్రమిచ్చే నిధుల్లో కోత పెట్టడం వల్ల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నదని ఎత్తిచూపారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాఖపరమైన అంశాలపై మంత్రులు చర్చించారు. తెలంగాణకు గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నిధులను పెంచాలని సీతక్క విజ్ఞప్తి చేశారు. గతేడాది కేంద్రం తెలంగాణకు 12 కోట్ల పని దినాలు మంజూరు చేసిందని, ఈ ఏడాది 6.5 కోట్ల పని దినాలకే పరిమితం చేసిందని ఎత్తిచూపారు. దీనివల్ల కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదముందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తదనంతరం ఉపాధి హామీ చట్టంపై ఆంక్షలు విధించకుండా నిధులు పెంచాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. సీతక్క విజ్ఞప్తికి కేంద్ర మంత్రి పి చంద్రశేఖర్ సానుకూలంగా స్పందిస్తూ న్యాయం చేసేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- అరవింద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాకాలం ముగిసే వరకు వరదలపై ప్రజలకు ఎప్పటికప్పుడూ సమాచారం అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటిడిఎ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికల్లో భాగంగా వరద ముంపు ప్రాంతాలను గుర్తించడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో వరద ముంపు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సకాలంలో స్పందించకపోతే చిన్న సమస్య కూడా పెద్ద విపత్తుగా మారే అవకాశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎన్‌డిఆర్ఎఫ్, జిల్లా అగ్నిమాపక శాఖ బృందాలు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా ఆధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడూ తగు చర్యలు చేపట్టాలని సూచించారు. సీజన్ వ్యాధులు ప్రబలే నేపథ్యంలో ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ.. ముందస్తుగా వరద నివారణ ప్రణాళికలను గుర్తించి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించవచ్చన్నారు. అంతకు ముందు అరవింద్ కుమార్ కలెక్టర్ దివాకర టీఎస్, ఐటిడిఎ పీవో చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజ్ నీటి నిల్వలు, గేట్ల వివరాలను పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి నీరు ఎంత వరకు వస్తుంది.. ఏ మేరకు దిగువకు విడుదల చేస్తున్నారని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంతరావు, ఇరిగేషన్ అధికారి అప్పలనాయుడు, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్రికల్చర్, సివిల్ సప్లయ్, విద్యుత్, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

బావిలో దూకిన భార్య

- ఆమెను కాపాడబోయి భర్త, ఆమె చెల్లి మృతి
- వికారాబాద్ జిల్లాలో విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లాలో విషాద ఘటన జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భార్య బావిలో దూకగా.. ఆమెను కాపాడబోయి భర్త, ఆమె చెల్లి ఇద్దరూ మృతిచెందారు. ఈ ఘటన మోమిన్‌పేట్ మండల పరిధిలోని చీమలదరి గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన మాసయ్య (60), అలివేలు దంపతులతోపాటు అతని మరదలు నాగమణి (50) మోమిన్‌పేటకు వలస వచ్చారు. చీమలదరి గ్రామ సమీపంలోని పూజిత వెంచర్‌లో మూడు నెలల కిందట పనిలో చేరారు. ప్రతిరోజూ వెంచర్‌లో పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సోమవారం రాత్రి మాసయ్య, అలివేలు గొడవ పడ్డారు. క్షణికావేశంలో అలివేలు గ్రామ సమీపంలోని అశోక్‌కు చెందిన బావిలో దూకింది. గమనించిన మాసయ్య ఆమెను కాపాడేందుకు బావిలో దూకాడు. వారిని కాపాడేందుకు నాగమణి కూడా బావిలో దూకింది. అది గమనించిన వెంచర్ కాంట్రాక్టర్, డ్రైవర్ ప్రసాద్ వెంటనే బావి దగ్గరకు వెళ్లి ముగ్గురినీ రక్షించే ప్రయత్నం చేశారు. మాసయ్య, నాగమణి నీటిలో మునిగి మృతి చెందారు. అలివేలును రక్షించారు. అలివేలును చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ అరవింద్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాసయ్య-అలివేలు దంపతులకు కొడుకు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాప్‌స్టోన్ సర్వీసెస్ లాభాల్లో 84 శాతం వృద్ధి

హైదరాబాద్ : మానవ వనరుల సొల్యూషన్స్ సంస్థ కాప్‌స్టోన్ సర్వీసెస్ లిమిటెడ్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 84.63 శాతం వృద్ధితో రూ.6.13 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3.32 క్లో లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.153.65 కోట్లుగా ఉన్న అమ్మకాలు.. గడిచిన త్రైమాసికంలో 24.50 శాతం పెరిగి రూ.191.29 కోట్లకు చేరాయి.

బిఎల్ఎస్ ఇంటర్నేషనల్‌కు రూ.711 కోట్ల రెవెన్యూ

న్యూఢిల్లీ : టెక్ ఆధారిత సేవలనందించే బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 44 శాతం వృద్ధితో రూ.711 కోట్ల రెవెన్యూను ప్రకటించింది. కంపెనీ రెవెన్యూ 50 శాతం పెరిగి రూ.181 కోట్లుగా నమోదయ్యిందని తెలిపింది.

సానోఫీ కన్స్యూమర్‌కు రూ.61 కోట్ల లాభాలు

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో సానోఫీ కన్స్యూమర్ హెల్త్‌కేర్ లిమిటెడ్ నికర లాభాలు 21 శాతం పెరిగి రూ.60.7 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ రెవెన్యూ 28 శాతం వృద్ధితో రూ.220.9 కోట్లుగా చోటు చేసుకున్నాయి. అమ్మకాలు 27 శాతం పెరిగినట్లు ఆ కంపెనీ తెలిపింది. గడిచిన త్రైమాసికంలో రెండు కొత్త ఉత్పత్తులను రీలాంచ్ చేశామని సానోఫీ కన్స్యూమర్ హెల్త్‌కేర్ ఇండియా ఎండి హిమాన్షు బక్షి తెలిపారు.

భారత్‌లో ఫోల్డబుల్స్ ఫోన్లకు భారీ ఆదరణ

- సామ్‌సంగ్ సిఇఒ వెల్లడి

గూర్‌గావ్ : భారత్‌లో ఫోల్డబుల్స్ ఫోన్లకు భారీ ఆదరణ లభిస్తుందని సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా సిఇఒ జెబి పార్క్ పేర్కొన్నారు. సామ్‌సంగ్ ఏడవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, జెడ్ ఫ్లిప్7, జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఇ దేశంలో విడుదలైన 48 గంటల్లో 2.1 లక్షల ప్రీ ఆర్డర్‌లు లభించాయన్నారు. భారతదేశం అపూర్వ అవకాశాలతో కూడిన వ్యూహాత్మక మార్కెట్ అని పేర్కొన్నారు.

ఆసుస్ ల్యాప్‌టాప్‌లపై 53 శాతం డిస్కౌంట్లు

చెన్నయ్ : భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తైవాన్ టెక్ దిగ్గజం ఆసుస్ తన ల్యాప్‌టాప్‌లపై 53 శాతం వరకు డిస్కౌంట్లను అందిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్లు ఆగస్టు 17 వరకు రిలయన్స్ డిజిటల్, క్రోమా, విజయ్ సేల్స్ వంటి ప్రముఖ రిటైల్ స్టోర్లు, ఆసుస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆసుస్ ఇండియా తెలిపింది. ఈ సేల్‌లో రూ.3,000 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్లు ఉంటాయని.. రూ.33,990 నుంచి ల్యాప్‌టాప్ ధరలు ప్రారంభమవుతాయని తెలిపింది.

టిజిహెచ్‌ఎంఎ రాష్ట్ర అధ్యక్షులుగా చంద్రప్రకాశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీజీహెచ్‌ఎంఏ)లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (జీహెచ్‌ఎంఏ) విలీనమైంది. మంగళవారం హైదరాబాద్‌లో టీజీహెచ్‌ఎంఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జి హేమచంద్రుడు, గౌరవాధ్యక్షులుగా పి మురళీకృష్ణ, ముఖసలహాదారులుగా పర్వతి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, జాక్టో చైర్మెన్ జి సదానందంగౌడ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. బీసీటీఏ అధ్యక్షులు కె కృష్ణుడు ఎన్నికల పరిశీలకులుగా పనిచేశారు.

'డ్యాం'కు ప్రమాదం.. ఇళ్లు ఖాళీ చేయండి..

- సేఫ్టీ పేరుతో ఎల్ఎమ్‌డి పరిధిలో నివాసితులకు నోటీసులు
- ప్రభుత్వ అనుమతితోనే ఇళ్లు నిర్మాణం
- చట్టం పేరుతో మమ్మల్ని ఆగం చేస్తారా? : నిర్వాసితులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎమ్‌డి) చుట్టూ ఒకటే ఆందోళన. సుమారు 40 ఏండ్ల కిందట డ్యాంలో గ్రామాలు కోల్పోయి 120 కుటుంబాలు నిర్వాసితులయ్యాయి.. వారికి 20 ఏళ్ల కిందట 60 గజాల చొప్పున ప్రభుత్వం స్థలం కేటాయించగా.. అక్కడే నివాసముంటున్నారు.. ఇప్పుడు వారికి ఇరిగేషన్ శాఖ నుంచి నోటీసులు అందాయి. డ్యాం భద్రతా చట్టం 2021 ప్రకారం.. డ్యాం కట్ట నుంచి 200 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలూ ఉండకూడదని, వాటిని తొలగించకపోతే జైలు శిక్ష విధిస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో పట్టాభూముల్లో ఇండ్లు కట్టుకున్నవారూ భయాందోళనకు గురవుతున్నారు. అదే సమయంలో డ్యాం సమీపంలోనే ఉన్న డైట్ కాలేజీలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచింది. దీని సమీపంలోనే ఐటి టవర్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలూ ఉన్నాయి. వాటి పరిస్థితి ఏంటన్నది చర్చనీయాంశంగా మారింది.

కరీంనగర్ పట్టణ సమీపంలో మానేరు నదిపై 24 టిఎంసిల సామర్థ్యంతో 1978లో లోయర్‌మానేరు డ్యాంకు శంకుస్థాపన జరిగింది. నిర్మాణం పూర్తి చేసుకుని 1985లో తాగు, సాగునీటి అవసరాల కోసం వినియోగంలోకి వచ్చింది. ఈ డ్యాం అల్గునూర్ నుంచి సూర్యాపేట వరకు అంటే 7 జిల్లాలు 33 మండలాలకు సంబంధించిన 9లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఎల్ఎమ్‌డీ ఆనకట్టకు, ఎన్‌హెచ్ బైపాస్ రోడ్డు మధ్యన డ్యాం నిర్మాణ సమయంలో పలు నిర్మాణాలు వెలిశాయి. సదరు డ్యాంలో ఇండ్లు, స్థలాలు కోల్పోయిన వారికి కట్టను ఆనుకునే అప్పటి ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. నిర్వాసితులంతా ఇండ్లు కూడా నిర్మించుకున్నారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం 21 డిసెంబర్ 2021 తేదీన జాతీయ డ్యాం భద్రత యాక్ట్ - 2021 అమలులోకి తెచ్చింది. ఈ యాక్ట్ ప్రకారం, ఇండియన్ స్టాండర్డ్ కోడ్ ప్రకారం.. డ్రయినేజీ వ్యవస్థ, రిలీఫ్ వెల్స్ పరిస్థితి, పనితీరుతోపాటు కట్ట నుంచి 200 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలుగానీ, కట్టడాలుగాని జరపకూడదు. డ్యాం భద్రతా దృష్ట్యా ఆ కట్టడాలను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులు వారం కింద ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. లేనిపక్షంలో డ్యాం భద్రత యాక్ట్ ప్రకారం ఏడాది వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధిస్తామని హెచ్చరించారు. గతంలో వచ్చినా అప్పటి ప్రభుత్వం నోటీసులు జారీ చేయలేదని తెలిసింది. దీని గురించి స్థానిక ఎంపి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రస్తావించలేదని తెలిసింది. తాజాగా నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

నివాసితుల గొంతుకలో ఆవేదన

ఈ ఏకపక్ష నిర్ణయాన్ని నోటీసులు అందుకున్న కుటుంబాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. వారి ఆవేదనను మీడియాతో చెప్పుకొచ్చారు. '35 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. స్థలాలు, నగలన్నీ అమ్ముకుని ఇక్కడ ఇళ్లు కట్టుకున్నాం. ఇప్పుడు రోడ్డున పడేస్తారా?' అంటూ రాజేశ్వరి అనే ఒక నివాసితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బి అంజయ్య అనే మరో నివాసి మాట్లాడుతూ.. 1990లోనే పట్టా స్థలాన్ని కొనుగోలు చేశామని, లింక్ డాక్యుమెంట్లతో పాటు నల్లా, విద్యుత్ కనెక్షన్లు కూడా ఉన్నాయని తెలిపారు. '30 ఏండ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. అప్పుడు అనుమతులు తీసుకుని ఇండ్లను నిర్మించుకున్నాం. కష్టపడి కొనుగోలు చేసుకున్న ఈ స్థలాలకు 200 మీటర్ల వరకు ఉండకూడదని ఆనాడే ఎందుకు చెప్పలేదు? ఇప్పుడు బతికేది ఎలా?' అంటూ అంజలి అనే నివాసి ప్రశ్నించారు. "ప్రత్యామ్నాయం చూపకుండా నోటీసులిస్తే ఎక్కడికి వెళ్లాలి?" అని గర్షకుర్తి రాజశేఖర్ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న కుటుంబాలన్నీ ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. 'డ్యాం చివరన ఉన్న మా ఇండ్లకు ఏనాడూ వరద రాలేదు. కనీసం నీటి నిల్వ సైతం లేదని, సీసీ రోడ్డు, డ్రయినేజీ వ్యవస్థతో సురక్షితంగా ఉన్న మా ఇండ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదు' అని హెచ్చరిస్తున్నారు.

జీరో అంతరాయాలే మా లక్ష్యం

- ఉదయం 8 గంటల నుంచే సెక్షన్ అధికారుల కార్యాచరణ
- టిజి ఎస్పీడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ
- బస్తీల్లో పర్యటించి సమస్యల గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జీరో అంతరాయాలే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తోందని, దానికి తగ్గట్టుగానే ఎల్‌టీ నెట్‌వర్క్ స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ వరకు తనిఖీలు చేస్తున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజి ఎస్‌పిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఏమన్నా లోపాలు ఉంటే సరిదిద్దేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని గతంలో సూపరింటెండింగ్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహులుతో కలిసి మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు సికింద్రాబాద్ సర్కిల్‌లోని జింఖానా సెక్షన్ పరిధిలో పలు బస్తీలు, గల్లీల్లో కాలినడకన తిరిగి వినియోగదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్‌టి నెట్‌వర్క్‌ను తనిఖీ చేశారు. వేలాడుతున్న తీగలు, జాయింట్లు ఉన్న కేబుల్స్, సరైన ఇన్సులేషన్ లేని హెచ్‌జీ ఫ్యూజ్‌సెట్‌లను గుర్తించి సాయంత్రం వరకు సరి చేసి తనకు ఫొటోలు పంపాల్సిందిగా విద్యుత్ అధికారులను ఆదేశించారు. సెక్షన్ అధికారులు (అసిస్టెంట్ ఇంజనీర్లు) ఉదయం ఎనిమిది గంటల నుంచి తమ కార్యాచరణ మొదలు పెట్టాలనీ, ఏరియాల వారీగా ఎల్‌టీ నెట్‌వర్క్‌లో పోల్ టు పోల్ తనిఖీలు చేయాలనీ, ఏమైనా లోపాలు ఉంటే సరి చేయాలనీ సూచించారు. విద్యుత్ ఇంజినీర్లు, సిబ్బంది నిరంతర కృషి వల్ల 33 కెవి, 11 కెవి నెట్‌వర్క్‌లలో చాలా వరకు సమస్యలు తగ్గాయన్నారు. భారీ గాలులు, వర్షం వల్ల ఎక్కడైనా చెట్లు/ కొమ్మలు విరిగి స్తంభాలపై పడినప్పుడు విద్యుత్ సరఫరా సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. వాటిని కూడా అతి తక్కువ సమయంలోనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ పూర్తయ్యే వరకు తాను కూడా క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. సిఎండి వెంట మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, సికింద్రాబాద్ ఎస్ఇ గోపయ్య, డిఇ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

ఆగస్టు 15న ఫోన్‌కు ఓ గంట సెలవు

- కెన్‌స్టార్ క్యాంపెయిన్

హైదరాబాద్ : ప్రముఖ కూలర్ల కంపెనీ కెన్‌స్టార్ 'నో ఫోన్ అవర్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఫోన్‌లను ఆఫ్ చేసి, కుటుంబం, స్నేహితులతో సమయం గడపాలని పిలుపునిచ్చింది. డిజిటల్ గందరగోళం నుంచి బయటపడి, నిజమైన అనుబంధాలను ఆస్వాదించేలా ఈ క్యాంపెయిన్ ప్రోత్సహిస్తోందని కెన్‌స్టార్ సిఇఒ సునిల్ జూన్ పేర్కొన్నారు.



మరోసారి త్యాగానికి వెనుకాడను

- మంత్రి పదవి కోసం ఎవర్నీ బతిమిలాడను
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు నియోజకవర్గ ప్రజల కోసం అవసరమైతే మరోసారి పదవి త్యాగానికి వెనుకాడేది లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తేల్చి చెప్పారు. నల్లగొండ జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం లచ్చమ్మగూడ గ్రామంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. "మునుగోడు నియోజకవర్గ ప్రజల కోసం పోరాడుతా.. ఎంత దూరమైనా పోతా.. అవసరమైతే వేల మంది కార్యకర్తలతో సెక్రెటేరియట్‌ను ముట్టడి చేస్తా.. అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు.. తన రాజీనామా వల్ల గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని నియోజకవర్గ ప్రజల కాళ్ల ముందుకు తీసుకొచ్చిన.. అవసరమైతే ప్రస్తుత ప్రభుత్వాన్ని తీసుకురావడానికి వెనుకాడేది లేదు.." అని అన్నారు. మంత్రి పదవి రాక రాజగోపాల్‌రెడ్డి ఏదేదో మాట్లాడుతుండని అనుకుంటున్నారని.. అది వాస్తవం కాదన్నారు. ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి ఇస్తానన్నారని, కానీ మునుగోడు ప్రజలు, అభివృద్ధి కోసం ఇక్కడి నుంచే పోటీ చేశానని చెప్పారు. మంత్రి పదవి తనకు ముఖ్యం కాదని, నియోజకవర్గ ప్రజలే ముఖ్యమన్నారు. మంత్రి పదవి కోసం పాకులాడాల్సిన అవసరం తనకు లేదన్నారు. "ఎంపీని గెలిపించమన్నారు.. గెలిపించిన.. పార్టీలోకి రమ్మన్నరు వచ్చిన.. మంత్రి పదవి ఇస్తానన్నది మీరే.. మాట తప్పింది మీరే.. నేను రాకపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదే కాదు" అని అన్నారు. పార్టీలో సీనియర్నీ.. నాకంటే జూనియర్లకు మంత్రి పదవి ఇచ్చారని ఆరోపిం చారు. ఇస్తారా? ఇవ్వరా? అది మీ ఇష్టం.. మంత్రి పదవి కావాలని బతిలాడేటోన్ని కాదని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. ఐదు వేల కోట్లు ఎట్లా తీసుకుపోతారని ప్రశ్నించారు. అప్పట్నుంచి తనకు నిద్ర పట్టడం లేదన్నారు. పార్టీలకతీతంగా నిరుపేదలందరికీ ఇళ్లు ఇవ్వాల్సిందేనన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందా లన్నదే తన లక్ష్యమన్నారు. రూ.1200 కోట్లతో రాచకొండ లిఫ్టు ప్రాజెక్టును పూర్తి చేసుకుం దామని చెప్పారు. అనంతరం చిమిర్యాల గ్రామంలో నిర్మించనున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. రాచకొండలోని పలు తండాలలో పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి

'కాళేశ్వరం' నిర్మాణం సమిష్టి నిర్ణయమే

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాలనేది నాటి క్యాబినెట్ తీసుకున్న సమిష్టి నిర్ణయమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన "కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు" అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. నాటి క్యాబినెట్‌లో ఉన్న వారిలో ఇద్దరు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మంత్రులుగా ఉన్నారని చెప్పారు. క్యాబినెట్ నోట్ 20 నుంచి 30 పేజీలు ఉంటుందని దాన్ని కాంగ్రెస్ సర్కార్ బయట పెట్టడం లేదన్నారు. గవర్నర్, ఆర్థిక మంత్రి ప్రసంగాల్లోనూ కాళేశ్వరం అంశం ఉందనీ, వాటిని క్యాబినెట్ ఆమోదించిందని గుర్తుచేశారు. మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీలోనూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. ప్రాణహితకు జాతీయ హోదా ఇవ్వాలని కెసిఆర్ ప్రధానికి లేఖ రాశారని చెప్పారు.

కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అనుమతి ఉందా?

కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అనుమతి ఉందా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. డిపిఆర్ లేకుండానే రేవంత్‌రెడ్డి పనులు ప్రారంభించారనీ, బిల్లులు చెల్లించారని తెలిపారు. ఒక్క అనుమతి ఉన్నా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చూపించాలని సవాల్ విసిరారు. అనుమతి లేకుండా బిల్లులు ఎలా చెల్లించారో చెప్పాలని ప్రశ్నించారు.

పోలవరం కూలితే మోడీపై చర్యలెందుకు తీసుకోలేదు? పోలవరం మూడుసార్లు కూలిన సమయంలో దాన్ని నిర్మించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఎన్‌డిఎస్‌ఎ సిడబ్ల్యూసిలో అంతర్భాగమని, దానికి దేశమంతా ఒకే నీతి ఉంటుందా? లేక రాష్ట్రానికో నీతి ఉంటుందా? అని నిలదీశారు. కాళేశ్వరం విషయంలో ఎన్నికలకు ముందు మూడు రోజుల్లోనే నివేదిక ఇచ్చి, మూడు సార్లు కూలిన పోలవరంపై ఎన్‌డిఎస్‌ఎ ఎందుకు వెళ్లడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. పోలవరం కూలితే ఎగ్జిక్యూటివ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వానిది బాధ్యతనా? ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నిర్మించిన పోలవరం కూలిందనీ, మళ్లీ ఆయనే కాళేశ్వరంపై నివేదిక ఇచ్చారన్నారు. చంద్రశేఖర్ అయ్యర్‌పై చర్యలెందుకు లేవు? ఎస్ఎల్‌బిసి కూలి మరణించిన వారి దేహాలు బయటకు తీయలేదనీ, ఈ ఘటనలో సిఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిపై చర్యలెందుకు తీసుకోలేదు? అని హరీశ్ రావు ప్రశ్నలు వేశారు.

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనమివ్వాలి

- పిఎఫ్ సరిగ్గా ఇవ్వని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి : సోమన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని సెక్యూరిటీ గార్డులను స్కిల్డ్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న డిమాండ్ చేశారు. పిఎఫ్ సరిగా అమలు చేయని థర్డ్ పార్టీ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య అధ్యక్షతన యూనియన్ సమావేశం జరిగింది. అందులో సోమన్న మాట్లాడుతూ... మార్కెట్‌లలో పేరుకే సెక్యూరిటీ గార్డు విధులనీ, వారితో వేలం పాటలు నిర్వహించడం, క్లరికల్ పనులు చేయించడం, చెక్‌పోస్టుల్లో రవాణా వాహనాలను ఆపి తనిఖీలు చేయించడం, ఆన్‌లైన్ ద్వారా రశీదులు జారీ చేయించడం, మార్కెట్ ఫీజు వసూలు చేయించడం వంటి పనులు అప్పగిస్తున్నారని చెప్పారు. ఇలా అన్ని పనులు చేయించి కనీస వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. సెక్యూరిటీ గార్డులకు వేతనాలను ఏజెన్సీల ద్వారా కాకుండా మార్కెట్ కమిటీల ద్వారానే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి బీమా చేయించాలనీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. 61 ఏండ్లు దాటిన సెక్యూరిటీ గార్డులకు కుటుంబ పోషణార్థం రూ.5 లక్షలను మార్కెట్ కమిటీల నుంచి ఇప్పించాలని విన్నవించారు. సమావేశంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలి సదయ్య, రాష్ట్ర నాయకులు జి.వెంకటనారాయణ, బి.వెంకట్, ఎమ్‌డీ.యాకూబ్, ఎ.సోమయ్య, సారయ్య పాల్గొన్నారు.



యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు, యువత గంజాయికి, డ్రగ్స్‌కి బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, వాటి నిర్మూలనకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ కోరారు. డివైఎఫ్ఐ అధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయికి అలవాటుపడి మంచి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి మత్తులో జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారని అన్నారు. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించినా గంజాయి, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. నిరంతరం నిఘా పెట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సమాజం కలిసికట్టుగా పోరు చేస్తేనే మాదక ద్రవ్యాల మహమ్మారిని తరిమేయడం సాధ్యం అవుతుందన్నారు. డీవైఎఫ్ఐ నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి పి.జగన్ మాట్లాడుతూ.. జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్నా స్థానిక యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతోనే యువత చెడు వ్యసనాల వైపు మళ్లుతున్నారని చెప్పారు. ప్రభుత్వాలు సరైన అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య, పి శివశంకర్, ఆర్ స్వామి, రాఘవేందర్, శివ, చైతన్య, మహేష్, ప్రభాకర్, లెనిన్, వినోద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుల సరికొత్త మోసాలు

- ఆన్‌లైన్ రెంటల్ రెఫరల్ స్కామ్‌తో బురిడీ
- యువకుడికి రూ.35 లక్షలకుపైగా కుచ్చుటోపీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోజుకో తీరులో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్థులు సరికొత్త మోసాలకు తెరలేపారు. 'ఆన్‌లైన్ రెంటల్ రెఫరల్' పేరుతో నగర యువకుడి నుంచి రూ.35,26,677 దండుకున్నారు. ఇందుకు సంబంధించి సైబర్‌క్రైమ్ ఎసిపి శివమారుతీ మంగళవారం వివరాలు వెల్లడించారు. ముషీరాబాద్‌కు చెందిన ఓ యువకునికి వాట్సప్‌లో మెసేజ్ వచ్చింది. దానికి స్పందించిన యువకునికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. తాము కేరళకు చెందిన నికితా జీవన్, శివ ప్రకాష్‌గా పరిచయం చేసుకున్నారు. rent/steadylease.net ప్లాట్‌ఫామ్‌లో పనిచేస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చని నమ్మించారు. మీరు చేయాల్సిందల్లా స్థానికంగా ఉన్న అద్దె ఇండ్లు, దుకాణాలు, ఖాళీ స్థలాల జాబితాను మాకు ఆన్‌లైన్‌లో పోస్టు చేస్తే సరిపోతుందని, దానికి జీతంతోపాటు కమీషన్ డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. మీరు ఉద్యోగంలో చేరాలంటే ముందుగా రూ.10వేలు డిపాజిట్ చేస్తే ఆదాయంతోపాటు బోనస్, లాభాలు వస్తాయని నమ్మించారు. వారి మాటలు నమ్మిన యువకుడు రూ.10వేలు డిపాజిట్ చేశాడు. ప్రతిఫలంగా వారు రూ.10,748ను పంపించారు. ఉద్యోగం బాగుందని నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా మళ్లీ రూ.31,259 పంపించాడు. దానికి సైబర్ నేరస్థులు అనుకున్న ప్రకారం డబ్బులను తిరిగి పంపించారు. దాంతో మరింత నమ్మకం కుదరడంతో బాధితుడు వారితో లావాదేవీలు సాగించాడు. అలా మొత్తం రూ.35,26,677 డిపాజిట్ చేశాడు. దానికి వచ్చిన లాభాలను తీసుకునేందుకు ప్రయత్నిస్తే డబ్బులు విత్‌డ్రా కాలేదు. దాంతో సైబర్ నేరస్థులను సంప్రదిస్తే మరో రూ.12 లక్షలు డిపాజిట్ చేస్తే మొత్తం డబ్బులు తీసుకోవచ్చని నమ్మించారు. దాంతో అనుమానం వచ్చిన బాధితుడు ఆరా తీసి మోసపోయినట్టు గుర్తించాడు. ఈ క్రమంలో సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎసిపి తెలిపారు.

బోడేపూడి స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం శాసనసభాపక్ష మాజీ నేత బోడేపూడి వెంకటేశ్వరరావు స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బోడేపూడి 28వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి, తండ్రి మరణంతో మధిర ప్రాంతం నుంచి వైరా గండగలపాడు మేనమామ ఇంటికి తల్లితోపాటు చేరిన ఆయన బంధువుల ఇంట్లో జీతం చేస్తూ...తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో సింగరేణి బొగ్గు గని కార్మికుల నేత డి. శేషగిరిరావుకు ఉత్తర ప్రత్యుత్తరాలు చేరవేసే కొరియర్ బాధ్యతలు నిర్వహించాలని గుర్తు చేశారు.వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారని తెలిపారు. రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఖాజా రాధాకృష్ణమూర్తి సూచనతో పాఠశాల ప్రారంభించి విద్యా వ్యాప్తికి ఆయన ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. వైరా రిజర్వాయర్, నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగు నీరు అందించేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, పరిహారం, నాణ్యమైన విత్తనాలు కోసం, దళారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి రైతు బాంధవుడుగా కీర్తి ప్రతిష్టలు పొందారని చెప్పారు. సరైన తాగునీరు లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారంటూ సుజల స్రవంతి పథకం కోసం పాలకులపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పి జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసగిస్తున్న కాంగ్రెస్, బిజెపి

- ఆమ్ ఆద్మీ పార్టీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలను మోసగిస్తున్న కాంగ్రెస్, బిజెపిల్లోని బిసి నాయకులు రాజీనామా చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర మాజీ అధ్యక్షులు బుర్ర రాము గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చాకే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లలో హిందూ, ముస్లీం అంటూ విద్వేషాలను బిజెపి రెచ్చగొడుతున్నదని ఆయన మండిపడ్డారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ప్రవేశపెడితే ఆప్ మద్దతిస్తుందని తెలిపారు.